క్లుప్తంగా

కొత్త బొర్రంపేటకు రహదారి సౌకర్యం



రోడ్డును రోలింగ్ చేస్తున్న రోలర్

కొయ్యూరు: కొమ్మిక పంచాయతీ బొర్రంపేట నుంచి కొత్త బొర్రంపేట వరకు బీటీ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.60 లక్షలతో రోడ్డును నిర్మిస్తున్నారు. రాజవొమ్మంగి నుంచి బడదనపల్లి మీదుగా గొలుగొండ మండలం వచ్చేందుకు అటు నుంచి కొయ్యూరు మండల కేంద్రానికి ఈ రహదారి ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు. కొయ్యూరు మండలంలో కొన్ని గ్రామాల నుంచి రాజవొమ్మంగి వెళ్లేందుకు ఈ మార్గం దూరాభారాన్ని తగ్గిస్తుందని పలువురు భావిస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



కొండకించంగిలో బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ లోవకుమారి

గూడెంకొత్తవీధి: జల్‌జీవన్ మిషన్ నిధులతో గిరిజన గ్రామాల్లో తాగునీటి సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు జర్రెల ఎంపీటీసీ అడపా లోవ కుమారి అన్నారు. జర్రెల పంచాయతీ కొండకించంగి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో బోరు బావి నిర్మాణ పనులను ఆమె ఆదివారం ప్రారంభించారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు అడపా విష్ణుమూర్తి, రాజుబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టాలమ్మ అమ్మవారి సంబరాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజవొమ్మంగి: మండలంలోని ఒట్టిగెడ్డ గ్రామదేవత పట్టాలమ్మ అమ్మవారి సంబరాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు మే 6వ తేదీ వరకు జరుగుతాయని, రోజూ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా మే 3న బుర్రకథ, 4న డాన్స్‌బేబీ డాన్స్, 5న చిడతలకోపు, కింగ్‌కోబ్రా ప్రోగ్రాం, గరగ నృత్యాలు, కాంతారా నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరపాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. ఆయన ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా, దిగ్విజయంగా జరిపించాలని సూచించారు. దొన్నుదొర, కమిటీ సభ్యులు దాసుబాబు, రమేష్, చందు, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు బోనాలు సమర్పణ



మాకవరపాలెంలో దుర్గాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో దుర్గాలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా గంధ అమావాస్య రోజున ఈ పండగను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు సచివాలయం పక్కనే ఉన్న దుర్గాలమ్మ ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సారె, బోనాలు గ్రామంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు.



శిథిలావస్థకు చేరిన కామయ్యపేట పాఠశాల భవనం

సమస్యల్లో సర్కారు బడులు

శిథిలదశకు చేరిన భవనాలు

అధ్వానంగా పాఠశాలలు

ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

పట్టించుకోని అధికారులు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల భవనాలు అధ్వానంగా ఉన్నాయి. ఈ ప్రాంగణంలోని మూడు భవనాలు శథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 95 మంది ఉన్నప్పటికీ ఉన్న రెండు భవనాల్లో మాత్రమే విద్యార్థులను సరిపెట్టి తరగతులు కొనసాగిస్తున్నారు. తీగలవలస మేజర్ పంచాయతీ కావడంతో ఆ ప్రాంతంలో ఉన్న పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుతున్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

శిథిల భవనాల్లో భయం భయంతో విద్యార్థులు చదువుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నాడు–నేడు పథకం కింద రెండవ విడతలో పాఠశాల అభివృద్ధి పనులకు రూ.20లక్షలు మంజూరు చేశారు. అయితే ఆయా నిధులతో పాఠశాలలో ఉన్న ఒక్క భవనం మాత్రమే మరమ్మతులు జరిపి, నూతనంగా భోజనశాల నిర్మాణంతో పాటు తాగునీటి పథకం వంటి పనులు చేపట్టారు. ఆ తరవాత ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాలలోని ఓ తరగతి గది గోడ కూలిపోయింది. కిటికీలు, తలుపులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే గదులన్నీ నీరు ముంచెత్తుతోందని, తరగతుల నిర్వహణ కష్టంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకు మన్యంలోని పాఠశాలల అభివృద్ధిపై కనీసం దృష్టి సారించలేదని విమర్శిస్తున్నారు. దీంతో కామయ్యపేటలోని పాఠశాలలో సమస్య పరిష్కారానికి నోచుకోలేదని చెబుతున్నారు. శిథిలావస్థ భవనం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



వర్షానికి కూలిన పాఠశాల భవనం గోడ



తలుపులు,కిటికీలు లేక అధ్వానంగా దర్శనమిస్తున్న కామయ్యపేట పాఠశాల భవనం

వసతి సమస్య



మా గ్రామంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ భవనాలు బాగా లేకపోవడంతో ఒకే గదిలో రెండు తరగతులకు పాఠాలు బోధిస్తున్నారు. వసతి సమస్య వెంటాడుతోంది. దీంతో విద్యార్థులు సరిపోవడం లేదు. రెండు భవనాలు పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరి అద్వాన్నంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పాంగి సత్యరావు, కామయ్యపేట గ్రామం

నూతన భవనాలు మంజూరు చేయాలి



మా ప్రాంతంలో ఆశ్రమ పాఠశాల ఉన్నది ఒకటే. దీంతో పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడికి వచ్చి విద్య అభ్యసిస్తున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి పాఠశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలి.

పాంగి బీసు, సర్పంచ్, తీగలవలస పంచాయతీ

ప్రమాదభరితంగా జోలాపుట్టు ఆశ్రమ పాఠశాల వసతి గృహం



జోలాపుట్టులో శిథిలావస్థలో ఉన్న బాలుర వసతి గృహం

ముంచంగిపుట్టు: పెచ్చులూడుతున్న భవనాలు, పటుత్వం కోల్పోయిన గోడలు, ఎప్పుడూ కూలిపోతాయే తెలియని భవనాలు.ఆ భవనాల కిందనూ ప్రతి రోజు భయం భయంగా విద్యార్థులు భోజనాలు చేయాల్సిన పరిస్థితి. ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని,ప్రమాదాలు జరగక ముందే అధికారులు మేలుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలుర వసతి గృహం శథిలావస్థకు చేరుకుంది. ఆ భవనాల స్థితిగతులను పరిశీలించిన ఉన్నత అధికారులు విద్యార్థులకు ప్రమాదం అని భావించి కూల్చివేయాలని గతంలో ఆదేశాలు జారీ చేశారు.కానీ నేటికి వసతి గృహ నిర్వాహకులు భవనాలను కూల్చకుండా అందులో వంటశాలగా వినియోగిస్తున్నారు.ప్రతి రోజు భోజనాల కోసం వచ్చే విద్యార్థులు శిథిల భవనాల వద్దకే వచ్చి భోజనాలు తీసుకోవడం, అక్కడే భోజనాలు చేయడం చేస్తున్నారు. కొంత మంది విద్యార్థులు శిథిల భవనంపైకి ఎక్కి భోజనాలు చేస్తున్నారు. వసతి గృహం గోడలు బీటలు వారి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏ మాత్రం భవనాలు కూలిపోయిన ఊహకు అందని విధంగా భారీ ప్రమాదం జరిగి, ప్రాణ నష్టం జరిగేందకు ఆస్కారం ఉందని భయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో శిథిల భవనాన్ని తక్షణమే కూల్చివేయాలని వారు కోరుతున్నారు.

మిల్లెట్స్ హబ్‌లో అధునాతన యంత్రాలు



రాగిపిండి గ్రైండింగ్ యంత్రం



డుంబ్రిగుడలో మిల్లెట్స్ హబ్

డుంబ్రిగుడ: మండలంలోని ఉద్యానవన శాఖ, డీఆర్‌డీఏ (ఎస్‌ఈఆర్‌పీ) సౌజన్యంతో నిర్వహిస్తున్న చిరుధాన్యాల కొనుగోలు కేంద్రంలో(మిల్లెట్స్ హబ్) పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.20లక్షలతో వివిధ రకాల యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ మేరకు చోడి పిండి యంత్రం, సామ బియ్యం పాలిషింగ్ మిషన్, గ్రైండింగ్ యంత్రంతో ప్యాకింగ్ మిషన్‌ను ఏర్పాటుచేశారు. ఆయా యంత్రాల ద్వారా కేంద్రంలో గత రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన సుమారు 8 టన్నుల సామలను గ్రైండింగ్ చేసి, సరకును ప్యాకింగ్ చేసి సరఫర చేసేందుకు సిద్ధంగా ఉంచినట్టు నిర్వాహకుడు ఎల్.బి. అప్పలస్వామి చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ మురళి ప్రత్యేక చొరవతో ఐటీడీఏ అధికారులు ఇక్కడ ఈ యంత్రాలను ఏర్పాటు చేశారన్నారు. గిరిజనులకు కావలసిన చిరధాన్యాలు ఇక్కడ కొనుగోలు చేసుకోవచ్చని, అలాగే వారి వద్ద ఉన్న సామలు, రాగులు ఇక్కడ తీసుకువచ్చి విక్రయించుకోవచ్చన్నారు.



పాలిషింగ్ మిషన్



ప్యాకింగ్ యంత్రం

120 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తిబాబు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

వి.ఆర్.పురం: మండలంలోని రేఖపల్లిలో ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ప్రారంభించారు. వైద్య శిబిరంలో సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.శ్రీనివాసరావు, సంస్థ మండల కో–ఆర్డినేటర్ ఐ.వి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెల 26, 27 తేదీల్లో చింతూరు, వి.ఆర్.పురం ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాలకు వచ్చే రోగులకు టీపీ, సుగర్, పక్షవాతం, గుండెపోటు వంటి రోగులకు సంస్థ ద్వారా విశాఖపట్నంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు చెప్పారు. రోగితో పాటు వారి సహాయకులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు.

వి.ఆర్.పురం మండలంలో తమ సంస్థ తరఫున వలంటీర్లను ఏర్పాటుచేయనున్నామని, గౌరవ వేతనం రూ.3000తో పాటు టీఏ, డీఏలు అందజేయనున్నట్టు చెప్పారు. గ్రామంలో రోగులను గుర్తించి, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. వనవాసి ఆయుర్వేద మండల కార్యకర్తలు రాజారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల పండగ



వెన్నలపాలెంలో మర్రిచెట్టు నీడలో నిర్మించిన తలుపులమ్మ తల్లి ఆలయం



కె.జె.పురంలో మోదమాంబ ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

నాతవరం: గ్రామాల్లో గ్రామ దేవతల పండగలు భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మర్రిపాలెం, వెన్నలపాలెం, ఎం.పంచాయతీ శివారు ములగపూడి గ్రామాల్లో తలుపులమ్మ పండగను, సిద్ధిపట్నం, కొత్త ఎల్లవరం గ్రామాల్లో కోటసంతానమ్మ తల్లి పండగను, వై.బి.అగ్రహారంలో మైసమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మర్రిపాలెం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మాడుగుల రూరల్: గ్రామాల్లో గ్రామ దేవతలు ఓడ్డు పండగలు ఆదివారం ఘనంగా జరిగాయి. కె.జె.పురం గ్రామంలో భీశెట్టి అచ్చిమినాయుడు, అప్పలనర్సమ్మ కుటుంబ సభ్యుల సారథ్యంలో మోదమాంబకు ఓడ్డు పండగ నిర్వహించారు. గ్రామం నుంచి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాగరం, సురవరం, ఎం.కోటపాడు తదితర గ్రామాల్లో ఓడ్డు పండగ చేశారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలోని నూకాంబిక అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. రాత్రికి భజన కార్యక్రమం అలరించింది.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు: పాడేరు డివిజన్‌లోని 33కెవి చింతపల్లి ఫీడర్ పరిధిలో ఎటిగైరమ్మపేట, బుచ్చంపేట గ్రామాల్లో వ్యవసాయ ఫీడర్లు, ఓవర్ లోడు ఫీడర్ల విభజన పనుల నిమిత్తం చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల్లోని గ్రామాలకు ఈనెల 29న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఏవిఎస్ఎం.అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి విరామ బైబిల్ పాఠశాల

అరకులోయటౌన్: ఈనెల 28వ తేది సోమవారం నుండి అరకులోయ మండల కేంద్రంలోని బెరాకా ప్రార్థన మందిరంలో విరామ బైబిల్ పాఠశాల (వీబీఎస్) నిర్వహించనున్నట్టు దైవ సేవకులు సహోదరుడు స్టీఫెన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే నెల 2వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. పప్పెట్ షోలు, సువార్త మ్యూజిక్, స్కిట్స్ , క్రాఫ్ట్‌స్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 94409 23270, 94411 28863 నంబర్లకు సంప్రదించాలని స్టీఫెన్ కోరారు.

ఘనంగా గంధం అమావాస్య పండగ

- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు
- దేవవరంలో బోనాలు సమర్పణ



దేవవరంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: నూకాలమ్మ అమ్మవారి నెల పండగ గంధం అమావాస్య పండగను పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవవరం, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, అమలాపురం, వేంపాడు, నెల్లిపూడి, ఉపమాక, పాటిమీద తదితర గ్రామాల్లో నూకాలమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి కానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దేవవరంలో వందలాది మంది మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రదక్షిణ చేసి నూకాలమ్మకు బోనాలు, సారె సమర్పించారు. అత్యంత వేడుకగా జరిగిన ఈ బోనాల ఊరేగింపులో గ్రామస్తులు వందలాది మంది పాల్గొన్నారు. ఆలయం వద్ద యువత ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ఉద్దండపురంలో గంధ అమావాస్య పండగను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అమ్మవారి దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణ, మజ్జిగ సరఫరా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గంధ అమావాస్య పండగను పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో ఆలయాలను కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, తాతబాబు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్ రాజు, ఎంపీటీసీలు తిరుపతిరావు, గొర్ల గోవిందు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు తదితరులు దర్శించుకున్నారు.

ఘనంగా నూకాంబిక నెల పండగ



ఊరేగింపులో భక్తులు

మునగపాక: నూకాంబిక అమ్మవారి నెల పండగ ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా జరిగింది. తిమ్మరాజుపేట, మునగపాక, పల్లపు ఆనంద పురం, గణపర్తి తదితర గ్రామాల్లో భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తిమ్మరాజుపేటలో ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. పలువురు మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

యలమంచిలి రూరల్: విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సి ప్రకారం 2025–26 సంవత్సరానికి మండలంలో అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని ఎంఈవో–1 వై మీనాక్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందులో అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూలు కులాలు 10 శాతం, షెడ్యూలు తెగలు 4 శాతం, బలహీన వర్గాలకు(బీసీ, మైనార్టీ, ఓసీ) 6 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో గానీ, లేదా సమీపంలోని సచివాలయం, మీసేవ కేంద్రాలు, ఎంఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 28 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు.